క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న డీపీఓ

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహరావు తెలిపారు. సోమవారం మండలంలోని కృష్ణాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా త్వరగా ధాన్యం తూకం వేసి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టారెడ్డి, ఏఈఓ కృష్ణావేణి పాల్గొన్నారు.

బీరప్పస్వామి ఆలయంలో పూజలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని లింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి దేవాలయంలో కామరాతి బీరప్ప స్వామి మహంకాళి దేవతల విగ్రహావిష్కరణ, కళ్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం గ్రామ నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

కంది(సంగారెడ్డి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి ఆ ప్రాంతమంతా చిట్టడివిలా మారింది. కనీసం ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ ఆఫ్ చేయడానికి సైతం వీలు లేకుండా పోయింది. దీంతో షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఒకే భవనంలో తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు పక్కనే పశువుల ఆసుపత్రి ఉండడంతో ప్రతిరోజు అధికసంఖ్యలో ఈ కార్యాలయాలకు వచ్చేవారు తమ వాహనాలను ఇక్కడే నిలుపుతుంటారు. దీంతో ప్రమాదం చోటుచేసుకోకుండా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉపాధిహామీలో 5,095 కూలీలకు పనులు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశం

రాయికోడ్(అందోల్): మండలంలోని అయా గ్రామాల్లో సోమవారం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 5,095 మంది కూలీలకు పనులు కల్పించినట్లు ఎంపీడీఓ వెంకటేశం అన్నారు. మండలంలోని నాగ్వార్, రాయికోడ్, ధర్మాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండా పంచాయతీ పరిధిలోని మన్యానాయక్ తండాలో సోమవారం భవానీమాత, సేవాలాల్ మహరాజ్‌ల విగ్రహాలను అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్ర రమేష్ చౌహాన్, ఎంపీటీసీ బక్షిరాం, మాద్వార్ తండా, డీఎన్‌టీ తండా సర్పంచ్‌లు రాజునాయక్, రవీందర్‌నాయక్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనులు ప్రారంభం

రామచంద్రపురం (పటాన్ చెరు): పట్టణంలోని కాకతీయనగర్లో ఓపెన్ నాలా పూడికతీత పనులను సోమవారం కార్పొరేటర్ పుష్పనగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలా పూడికతీత పనులను చేపట్టినట్లు తెలిపారు.

క్రీడారంగ అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల్లో ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేవిధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడాపోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి, బబురుగడ్డ పుష్పనగేష్, తహశీల్దార్ జయరాం, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ బాలయ్య, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జహీరాబాద్: క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని మొగుడంపల్లి ఎంపీపీ ప్రియాంకరెడ్డి, జెడ్పీటీసీ అరుణరెడ్డి అన్నారు. సోమవారం మొగుడంపల్లిలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు విజయ్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుండ్‌రెడ్డి, మక్సూద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం సీఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభమైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రామచందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అన్ని మండలాల్లో క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో సోమవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలు జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవారావు, ఎంపీపీ అధ్యక్షురాలు అంజమ్మ, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మారుతి రాథోడ్, సర్పంచ్ మాతంశెట్టి వీరమణిరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలను మండలంలోని కృష్ణాపూర్, సిర్గాపూర్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో డీఏఓ నర్సింహరావు, ఎంపీపీలు గుర్రపు సుశీలఅంజయ్య, మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, మొఘ్ని, ఎంపీడీఓలు సంగ్రామ్, సుజాత, ఎంపీఓ శ్రీనివాస్, ఎస్ఐలు ప్రశాంత్, నారాయణ, ఎంఈఓ శంకర్, సర్పంచ్‌లు కిష్టారెడ్డి, జంగం స్వప్న పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే మాణిక్‌రావు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని రంజోల్‌లో సీఎం కప్ క్రీడాపోటీలను సోమవారం ఎంపీపీ గిరిధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణకు ప్రభుత్వం రూ.3.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 2 శాతం, ఉన్నత విద్యాభ్యాసం కోసం 0.5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 19 వేల గ్రామాలు, పట్టణాల్లో 15 వేల క్రీడా ప్రాంగణాలను ప్రభుత్వం నిర్మించిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, బీఆర్ఎస్ అధ్యక్షులు సయ్యద్ మైహియోద్దీన్, రాములు, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, ఎంపీటీసీలు సంపత్ కుమార్, బస్వరాజ్, తట్టు నారాయణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ మేరకు మృతుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం రూ.2లక్షల బీమా చెక్కును క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్, బీఆర్ఎస్ నాయకులు బండి మోహన్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్

జోగిపేట(అందోల్): జోగిపేటకు చెందిన లబ్దిదారులకు మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్‌కుమార్ సోమవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సోమ సుభాష్‌కు రూ.52వేలు, అల్లె గోపాల్‌కు రూ.లక్ష విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు గాజుల అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతి



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ ఖాదిరాబాద్ రమేశ్

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని అక్సాన్‌పల్లి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు పదవ తరగతిలో 10 జీపీఏను సాధించినందుకు జెడ్పీటీసీ ఖాదిరాబాద్ రమేశ్ ప్రోత్సాహకంగా సోమవారం విద్యార్థినులకు నగదును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పనులను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని ఇశ్రితాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవనం స్లాబ్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భవనాన్ని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తొంట యాదమ్మకిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీడీఓ పూజ, సర్పంచులు రాములు, నవీన్ కుమార్, ఎంపీటీసీ లలిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్ సోదరుడు రాజశేఖర్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పరామర్శించారు. అయన వెంట ఎంపీపీ తొంట యాదమ్మ, ఎంపీటీసీ లలిత, పార్టీ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు యేసయ్య ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణంలోని 35వ వార్డులో కౌన్సిలర్ వీణాశ్రీనివాస్ అధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ సోమవారం బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ లతావిజేందర్‌రెడ్డి, హకీమ్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, ప్రభుగౌడ్, లక్ష్మణ్ కాలనీపెద్దలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగించుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి): ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలని రాష్ట్ర హ్యాండ్‌లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని 17 లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, ఎంపీటీసీ సత్యనారాయణ, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై ఆగ్రహం

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ఝరాసంగం(జహీరాబాద్): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ దేవదాసు అధ్యక్షతన ఎంపీడీఓ సుజాత మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండలంలోని పలు శాఖల అధికారుల పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలపై ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్వహించడంతో ఎంపీటీసీ శంకర్ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశంలో సమస్యల ప్రస్తావన

మండల పరిధిలోని ఈదులపల్లి, పొట్టిపల్లి రహదారుల నిర్మాణాలను సంవత్సరాలు గడుస్తున్నా పనులు ఎందుకు ప్రారంభించడంలేదని ఎంపీటీసీలు శంకర్ పాటిల్, రాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

- బొప్పన్పల్లిలో ఉన్న ట్యాంకు నిండా నీళ్లు వస్తాయని, తమ గ్రామంలో మాత్రం నీరు ఎందుకురావడం లేదని ప్యారవరం సర్పంచ్ సంజీవమ్మ వాపోయారు.
- ఈదులపల్లి శివారులో వెంచర్ నిర్వాహకులు చెరువు స్థలం కబ్జా చేశారని, సర్వే చేయాలని, మండల కేంద్రంలో ఏఈ, డిప్యూటీ అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో ఎంపీటీసీ శంకర్ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ ఎప్పుడు జమ చేస్తారని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు.
- అభివృద్ధి పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదని కోఆప్షన్ సభ్యుడు ఇక్బాల్ జానీ ప్రశ్నించారు.
- మెదపల్లి గ్రామంలో తాగునీరు రావడంలేదని అధికారులకు ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని అధికారుల తీరు పట్ల సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, ఎంపీటీసీ శంకర్ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఝరాసంగం మండల కేంద్రంలో మొక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.
- గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

వేగవంతంగా పనులు చేపడుతున్నాం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి జాతీయ రహదారి వరకు జీహెచ్ఎంసీ నిధులు రూ.29 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి డివిజన్‌లో ఇప్పటికే రూ.కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

పటాన్‌చెరు: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని లింగమయ్య కాలనీలో సిద్ధివినాయక వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి సోమవారం క్యాంపు కార్యాలయంలో రూ.6 లక్షలను సొంత విరాళంగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెర సంఘం సామాజిక భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్, వడ్డెర సంఘం నాయకులు సాయిలు పాల్గొన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని రాంమందిర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్‌షాప్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నిర్వాహకులు సందీప్, పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జీవితం ఆదర్శనీయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవితం నేటితరానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలోని సేవాలాల్ మహారాజ్, జగదాంబమాత ఆలయ 9వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సింధుఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, బాలాజీ, శ్రీశైలం, జ్యోతి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ ఆధ్యక్షులు దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.

విధుల్లోకి జేపీఎస్‌లు

నారాయణఖేడ్: మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డికి చేరికకు సంబంధించిన లేఖలను అందజేశారు. మండలంలో 28మంది జేపీఎస్‌లు, ఆరుగురు ఓపీఎస్‌లు కలిసి 34మంది ఉండగా అందరూ విధుల్లో చేరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తమ డిమాండ్లపై హామీ ఇవ్వడం, ప్రభుత్వంపై నమ్మకం ఉండటంతో విధుల్లో చేరుతున్నట్లు జేపీఎస్, ఓపీఎస్‌లు తెలిపారు.



ఎంపీడీఓకు లేఖలు అందజేస్తున్న జేపీఎస్‌లు

సంక్షిప్త వార్తలు

- **నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం**

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్‌లో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు విఠల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరుకానున్నారని తెలిపారు.

- **పుస్తెమెట్టెల అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన యాదగిరి కుమార్తె వివాహానికి కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా సోమవారం పుస్తెమట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి కుటుంబ సభ్యులు కాటా శ్రీనివాస్‌గౌడ్, సుధాలకు కృతజ్ఞతలు తెలిపారు.

- **నేటి నుంచి సీఎం కప్ పోటీలు**

జిన్నారం(పటాన్‌చెరు): నేటి నుంచి సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు జిన్నారం ఎంపీడీఓ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

కంది(సంగారెడ్డి): సీఎం కప్ టోర్నమెంట్‌ను రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. టోర్నమెంట్ నిర్వహించేందుకు కందిలోని మైనార్టీబాలుర రెసిడెన్సియల్ పాఠశాల క్రీడామైదానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం కప్ టోర్నమెంటు కమిటీలో చైర్మన్ ఎంపీపీ, కన్వీనర్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ, ఎస్సై, ఉంటారని పేర్కొన్నారు.

- **సన్మానం**

హత్నూర, (సంగారెడ్డి): గురుకుల కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకట వివేకానందను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వివేకానందను హత్నూర గురుకుల కళాశాల స్టాఫ్ సెక్రెటరీ శ్రీలత, ఆధ్యాపక బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు.

- **దరఖాస్తు చేసుకోండి**

నారాయణఖేడ్: మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనందునా దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 83శాతం ఉత్తీర్ణత సాధించగా, 10వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణతతో విద్యార్థినులు సత్తాచాటారన్నారు.

- **ఎస్‌బీఐలో కంప్యూటర్ల మొరాయింపు**

నారాయణఖేడ్: పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) మార్కెట్‌లోని శాఖలో సోమవారం కంప్యూటర్లు మోరాయించడంతో సేవలు నిలిచిపోయాయి. కంప్యూటర్లు మోరాయించిన విషయం తెలియక ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి వెనుదిరగక తప్పలేదు. అత్యవసర పరిస్థితుల్లో నగదు జమ, విత్‌డ్రాల తదితర సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులకు గురయ్యారు.

- **ఆర్థికసాయం..**

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని తేర్పోల్‌లోని పరిశుద్ధ సిలువ ప్రతిష్ఠ ఆరాదన మహోత్సవానికి గుంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పడమటి అనంత్‌రెడ్డి సోమవారం ఆ సంఘ నాయకులకు రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

- **తాగునీటిని అందించండి**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని కాలనీవాసులకు సరిపడ తాగునీరు అందించాలని కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్ రెడ్డి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి హాఫీజ్‌పేట్‌లోని జలమండలి జీఎం రాజశేఖర్‌ను కలసి తాగునీటి సమస్యలను వివరించారు. నీటి బిల్లుల విషయంలో గతంలో జలమండలి ఎండీ దానకిషోర్ ఆదేశాలను త్వరగా అమలుచేయాలని అధికారులను కోరగా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

- **కౌన్సిలర్లు సహకరించాలి**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం అమీన్‌పూర్ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తేవాలని సూచించారు. పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రూ.14.50 కోట్ల నిధులను ఖర్చు చేసేందుకు సభ్యులు అమోదం తెలిపారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- **ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత**

మునిపల్లి(అందోల్): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నర్సాపూర్ మండలంలోని నృసింహపూరం ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్యపాదగురు రాజయోగి వెంకటస్వామి భక్తులకు ఉపదేశించారు. సోమవారం మక్త క్యాసారం అత్మానందాశ్రమంలో వార్షికోత్సవం సందర్భంగా హోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ నిర్వాహకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

- **24న అంబేద్కర్ 'నృత్యరూపకం' ప్రదర్శన**

నారాయణఖేడ్: తహసీల్దార్ ఆవరణలో ఈ నెల 24న సాయంత్రం 6గంటలకు హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే అంబేద్కర్ జీవితచరిత్ర, సంఘం శరణం గచ్ఛామి నృత్యరూపకం నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింహులు తెలిపారు. నారాయణఖేడ్ అంబేద్కర్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నృత్యరూపకాన్ని తిలకించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షులు కాన్షీరాం, సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, ఆయా సంఘాల నాయకులు సంజీవులు, రాజ్‌కుమార్, సామేల్, లక్ష్మణ్, విఠల్, జ్యోతి లింగం పాల్గొన్నారు.

- **సిద్ధేశ్వర ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన**

జహీరాబాద్ టౌన్: అల్గోల్ రోడ్డులోని సిద్ధేశ్వర ఆలయంలో ఈ నెల 17 నుంచి శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గోపూజ, మహా గణపతిపూజ, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, జలాదివాసం, మంగళహారతి, 18న అవహిత దేవత పూజలు, ప్రతిష్ఠాపనలు, చండిహోమం, ధాన్యాధివాసం, విగ్రహాల అభిషేకం, 19న శనిశ్వేర విగ్రహాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, పూర్ణహుతి, మంగళహారతిచ మహాప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

- **మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలి**

పటాన్‌చెరు టౌన్: మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ కుమార్‌యాదవ్ తన జన్మదినాన్ని జేపీ కాలనీలోని శ్రీవాణి సాంఘిక సేవా కేంద్రంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు 10 కుట్టుమిషన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.